# నడిరోడ్డే బస్టాప్..!

ఎక్కాలంటే... రోడ్డు మధ్యకు వెళ్లాల్సిందేనా...!?

- రహదారి మధ్యనే బస్సులు ఆపుతున్న ఆర్టీసీ డ్రైవర్లు
- కూడలిలో బస్సెక్కడానికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య

**మేడికొండూరు:** ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం ఎన్ని చర్యలు చేపట్టినా అవి అమలుకు నోచు కోవటం లేదు. ప్రయాణికుల కోసం ఎన్ని సౌకర్యాలు కల్పించినా క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంతో అవి నీరు గారిపోతున్నాయి. పేరేచర్ల కూడలిలో ఆర్టీసీ అధికారులు గతంలో ఆర్టీసీ బస్సులను ఒక నిర్ణీత ప్రదేశంలో ఆపే విధంగా స్టాప్ బోర్డులు, దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీనికి తోడు గతంలో ఒక ఉద్యోగిని కూడా అక్కడ నియమించి బస్సులు స్టాప్ దగ్గరే ఆపే విధంగా చర్యలు తీసుకున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రహదారి మధ్యనే ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు ఆపటం వలన ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి అయితే చెప్పటానికి వీలు లేకుండా ఉంది.



పేరేచర్ల కూడలిలో రహదారి మధ్యనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకొంటున్న వైనం

### నిత్యం రద్దీగా ఉండే పెద్ద కూడలి

పేరేచర్ల అతి పెద్ద కూడలి కావటంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వందల బస్సులు ఈ కూడలి వెళ్తుంటాయి.

దానికి తగ్గట్లే ప్రయాణికుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. కూడలి మీదగా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల వెళ్లే బస్సులు ఒక వైపు నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం వెళ్లే బస్సులు మరో వైపు వెళుతుంటాయి. ఈ బస్సులు ఒకే చోట ఆపే విధంగా గతంలో ఆర్టీసీ అధికారులు రహదారి పక్కనే దిమ్మెలు, బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించటం వలన ప్రయాణికులు రోడ్డు మధ్యకు వెళ్లి బస్సులు ఎక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. పెదకూరపాడు, లగడపాడు, జలాల్‌పురం లాంటి గ్రామాలకు వెళ్లాలంటే గంటకో బస్సు ఉంటుంది. దీని కోసం ప్రయాణికులు అధిక సమయం వేచి చూసి బస్సు వచ్చి ఎక్కుదామనుకునే సమయంలో డ్రైవర్లు బస్సును రహదారి మధ్యలోనే ఆపి ఒకరినో ఇద్దరినో ఎక్కించుకొని వెళ్లటం వలన వృద్ధులు బస్సు ఎక్కలేక మరో బస్సు కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది.

### ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ సమస్య

బస్సును రోడ్డు మధ్యలో ఆపి ప్రయాణికలను ఎక్కించుకోవడంతో బస్సు కోసం పరిగెత్తే సమయంలో ప్రయాణికులు ఒక్కొక్కసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్సు ఎక్కే క్రమంలో ఇతర వాహనాలు, ద్విచక్ర వాహనదారులు బస్సుకు ప్రయాణికులకు మధ్య ఖాళీలో వాహనాలను దూసుకు పోనిస్తున్నారు. దీని వలన అనేక సార్లు ప్రమాదాలు సంభవించాయి. రహదారి మధ్యలో ఆపటం వలన పెద్ద వాహనాలు పోవటానికి ఖాళీ లేక ట్రాఫిక్ సమస్య కూడా జటిలంగా మారింది. పైగా ట్రాఫిక్‌లో వాహనాలు ఆగి ఉన్నప్పుడు వాహనదారులు మోగించే హారన్ల వలన ధ్వని కాలుష్యం పెరిగి ప్రయాణికులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

### ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి



పేరేచర్ల కూడలిలో పరిస్థితి గురించి ఆర్టీసీ అధికారులు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. పట్టించుకోకుండా వదిలేస్తే ఇబ్బంది కలుగుతుంది. ప్రయాణికులు భద్రత దృష్టిలో పెట్టుకొని డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యంగా మాచర్ల బస్సు డ్రైవర్లు మరీ వేగంతో పాటు ప్రయాణికులు ఎక్కకుండానే బస్సులు పోనిచ్చేస్తున్నారు.

– జగదీష్, పేరేచర్ల

### ఉద్యోగిని నియమించాలి



అసలే ఇరుకు రహదారులు అందునా నిత్యం ప్రమాదాలు జరిగే రహదారులు కావున ఆర్టీసీ అధికారులు ఇలాంటి పెద్ద కూడళ్లలో ఒక ఉద్యోగిని నియమించి వచ్చే బస్సులకు దిశా నిర్దేశం చేసే విధంగా చేయాలి. ఆర్టీసీ డ్రైవర్లు కూడా బస్సును స్టాప్ వద్దే ఆపి సహకరించాలి. ప్రయాణికులు కనీసం నిలిచి ఉండటానికి కూడా స్టాప్‌లు లేవు. కావున డ్రైవర్లు ఇది గుర్తుంచుకోవాలి.

– కుమార్, పేరేచర్ల

## ప్రతి ఒక్కరూ మొక్కను నాటుదాం

యూనివర్సల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 'ఏక్ పేడ్ మా కే నామ్ సే'



యూనివర్సల్ కాలేజీలో మొక్క నాటుతున్న కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ పామిశెట్టి

**మేడికొండూరు :** ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి సంరక్షించాలని యూనివర్సల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పామిశెట్టి బాలస్వామి అన్నారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం భారత్ గుంటూరు ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్ సే' కార్యక్రమంలో భాగంగా సోమవారం యూనివర్సల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో వెయ్యికి పైగా మొక్కలు నాటారు. డాక్టర్ పామిశెట్టి బాలస్వామి మాట్లాడుతూ మొక్కలు నాటడం, పరిరక్షించడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. పర్యావరణ సమతుల్యతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటి రెడ్డి, ఫాదర్ అనిల్ కుమార్, పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ బి.మర్రెడ్డి, యూనివర్సల్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలి



**మంగళగిరి:** వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు అప్పులు చేయక తప్పడం లేదని, వెంటనే ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య అన్నారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం అందజేయడంతో పాటు వెంటనే రైతులకు బీమా అందజేయాలని డిమాండ్ చేశారు. వర్షపాతం తక్కువ ఉన్న జిల్లాలు, రాయలసీమలో ప్రభుత్వం కరువు మండలాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రబీలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు వెంటనే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు చిన్ని తిరుపతయ్య, రైతు సంఘం నాయకులు గుంటక సాంబిరెడ్డి, జువ్వాది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### సూపర్ సిక్స్ అమలు చేయాలి

సీపీఎం నాయకులు



**తాడేపల్లిరూరల్ :** ఎన్నికలకు ముందు కూటమి హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టే కరుణాకరరావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ప్రాంతంలో సీపీఎం ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ అవినీతి లేని పారదర్శక పాలన అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం దానిని అమలులో చూపించాలని, ఉచిత ఇసుక విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ధరలను అదుపు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో రూ.18 వేల కోట్లను ప్రజలపై భారం మోపుతున్నారని, బెల్టు షాపులను నియంత్రించక పోగా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పి.గిరిజ, ఉష, ఎస్‌కే బాషా, కె.ప్రభాకర్, పి.దుర్గారావు, ఎల్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

### పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీ



**తాడేపల్లిరూరల్ :** నిత్యం పోలీసుల పహారాలో ఉండే ఉండవల్లిలో ప్రతి రోజు ఏదో ఒక చోట పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. తాజాగా సోమవారం తెల్లవారుజామున ఉండవల్లి అమరావతి రోడ్డులోని ఎడమ వైపు ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ వెంబడి రైతు తమ్మా వేమారెడ్డి పొలంలో ఉన్న విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. విద్యుత్ మోటారుతో పాటు విద్యుత్ తీగలను సైతం తొలగించినట్లు వేమారెడ్డి తెలియజేశారు. తిరిగి కొత్త మోటారు ఏర్పాటు చేయాలంటే రూ.15 వేలు ఖర్చు అవుతుందని, వ్యవసాయమే అంతంత మాత్రంగా ఉంటే ఇలాంటి చోరీలు జరుగుతుంటే రైతులు ఎలా జీవించాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 4 రోజుల వ్యవధిలో సుమారు 4 మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు.

### ప్రమాదకరంగా గుంత



**ఫిరంగిపురం:** మండలంలోని వేమవరం వెళ్లే దారిలో నీటి పైపుల గుంత ప్రమాదకరంగా మారింది. రెండు నెలల కిందట తాగునీటి సరఫరాలో భాగంగా పైపు లైను మరమ్మతులు నిర్వహించేందుకు ఆ శాఖ సిబ్బంది గుంతను తీసి పూడ్చకుండా వదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కగా వస్తూ దానిలో పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రోడ్డు మార్జిన్ పక్కనే ఉండటం గుంత పొడవుగా ఉండి లోతు కూడా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి గుంతను పూడ్చివేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆలయాల్లో కార్తిక దీప శోభ



ఫిరంగిపురం శివాలయంలో...



కాళహస్తీశ్వర ఆలయంలో...



వేమవరం కోటిలింగాల ఆలయంలో...

**ఫిరంగిపురం:** మండలంలోని పలు శివాలయాల్లో కార్తిక మాసం పురస్కరించుకొని భక్తులు ఉదయాన్నే ఆలయ పరిసరాల్లోని ఉసిరి, మారేడు చెట్ల కింద దీపాలు వెలిగించారు. ఫిరంగిపురంలోని కాళహస్తీశ్వర ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు. అర్చకులు ఆంజనేయ శర్మ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. వేములూరిపాడు జలపాలేశ్వర ఆలయంలో అర్చకులు ఉమాపతి శాస్త్రి స్వామికి నమకచమకాలతో అభిషేకాలు చేశారు. తక్కెళ్లపాడులోని విశ్వేశ్వరస్వామికి అర్చకులు లక్ష్మీనారాయణ శాస్త్రి విశేష పూజలు చేసి అఖండ హారతి ఇచ్చారు. వేమవరంలోని కోటి లింగాల ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. ధ్వజ స్తంభం వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వేదికపై దీపాలు వెలిగించారు. ఆలయ ఈశాన్య భాగంలో ఏర్పాటు చేసిన మరకత లింగానికి భక్తులు పూజాద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కోటి లింగాల చుట్టూ భక్తులు దీపాలు వెలిగించారు. యాగశాలలో మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ప్రణాళికా బద్ధంగా పనిచేసి పార్టీని పటిష్టం చేయాలి

తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు

**తాడికొండ :** జగనన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని పటిష్ఠ పరిచేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుంటూరు నగర డిప్యూటీ మేయర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) అన్నారు. సోమవారం గుంటూరులోని తన కార్యాలయంలో తాడికొండ నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గానికి తనను సమన్వయకర్తగా నియమించారని, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేసి, కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రస్తుతం ఉన్న పార్టీ సమస్యలు, ఇబ్బందులు, కార్యకర్తల కష్టాలను తెలుసుకుని వాటిపై ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇందు కోసం ప్రణాళికా బద్ధంగా మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అంతర్గతంగా అందరితో చర్చించి ఓ మంచి రోజు నియోజకవర్గంలో కార్యక్రమాల కోసం వస్తానని, అందుకు తగిన సహకారం అందించాలని కోరారు. లోపాలు, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే నేరుగా చర్చించి పరిష్కారం చేసి అన్ని విధాలా పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, తాళ్లూరు వంశీకృష్ణ, నాయకులు డీజే శ్రీను, జోజి తదితరులు పాల్గొన్నారు.



బాలవజ్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు

## డిసెంబర్ 16 నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు

**మంగళగిరి:** సకల సంపదలను ప్రసాదించే గోదావరి ఆచరించిన శ్రీకృష్ణ దీక్షా సహిత ధనుర్మాస వ్రత మహోత్సవాలు డిసెంబర్ 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు మంగళగిరి మండలం ఆత్మకూరు బాపూజీ విద్యాలయం ఆవరణలో సీతానగరం చిన జీయర్ ఆశ్రమం ఆధ్యాత్మిక వ్యాఖ్యాత కూర్మనాథ ఆచార్యులు తెలిపారు. ఆత్మకూరు వైటీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ధనుర్మాస వ్రత మహోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కుర్మానాథ ఆచార్యులు మాట్లాడుతూ భగవంతుడిని పొందడానికి నిజ జీవితంలో ఉన్నతిని సాధించడానికి ధనుర్మాస వ్రతం ఎంతో సులభోపాయమని తెలిపారు. అంత గొప్పదైన వ్రతాన్ని అందరూ ఆచరించి గోదా రంగనాథుల అనుగ్రహాన్ని పొందాలని కోరారు. ధనుర్మాస వ్రత మహోత్సవం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో, యదుకుల తిలక రత్న ట్రస్ట్, వైటీఆర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ధనుర్మాస వ్రతాన్ని ఆచరించడానికి ముందుగా మండలాల్లో, గ్రామాల్లో ఉన్న వారంతా ఏకమై శ్రీకృష్ణ దీక్షను చేపట్టాలని కోరారు. వైటీఆర్ ట్రస్ట్, బాపూజీ విద్యాలయం చైర్మన్ యర్రాకుల తులసీరామ్ మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమరావతి రాజధాని అభివృద్ధి చెందాలని కోరుతూ ధనుర్మాస వ్రత మహోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వేద విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ మధుసూదనాచార్యులు, విజయకీలాద్రి ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, ఆశ్రమ నిర్వాహకులు రఘునాథాచార్యులు, న్యాయవాది నాగార్జున బాబు, తుల్లిమిల్లి రామకృష్ణ, కొలుసు రాజా, త్రిపుర మల్లు సతీష్, బలరామ్ సేన, వికాస్ తరంగిణి నాయకులు రుక్మిణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వ్యాఖ్యాత కూర్మనాథ ఆచార్యులు తదితరులు

### ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

**తాడికొండ :** ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడికొండ మండల పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమరావతి మండలం ధరణి కోట గ్రామానికి చెందిన ఎ.శివనాగమల్లేశ్వరరావు (50) ఈ నెల 5న ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో శివనాగమల్లేశ్వరరావుకు తీవ్ర గాయాలు అయ్యాయి.

చికిత్స నిమిత్తం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 10న రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

## కుళాయి కనెక్షన్‌లకు నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

కొలకలూరులో పైపులైన్లను పరిశీలించిన తహసీల్దార్ గోపాలకృష్ణ

**తెనాలిరూరల్:** ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో తెనాలి మండలం కొలకలూరులోని ఎస్సీకాలనీలో వేస్తున్న పైపులైన్ల నుండి తాగునీటి కుళాయి కనెక్షన్‌ల కోసం అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు ఫిర్యాదు చేశారు. కాలనీలో రెండేళ్లుగా తాగు నీటి సమస్యతో బాధపడుతున్నామని, మురుగు నీరు వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సోమవారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కాలనీకి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి వెళ్లారు. పైపులైన్లను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఇంటింటికిచ్చే కుళాయి కనెక్షన్‌లకు అక్రమంగా కనెక్షన్‌కు రూ. వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నారని గ్రామస్తులు తహసీల్దార్‌కు వివరించారు. ఇప్పటి వరకు 300 కనెక్షన్‌లకు వసూలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పైపులైన్లలో లీకులు ఉన్నట్టు గుర్తించామని, జిల్లా కలెక్టర్ దృషికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాంట్రాక్టరుతో ఉన్న ఒప్పందాలు, వివాదాల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.



పైపులైన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

## ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

తహసీల్దార్ జియా వుల్ హక్

**పొన్నూరు:** వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

**అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి**

ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధులతో చేపట్టాల్సిన పనులను వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్ జియా, ఎంపీడీఓ చంద్రశేఖరరావు అన్నారు. మండలంలో జరుగుతున్న హౌసింగ్, ఉపాధిహామీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో రూ.6 లక్షల17 వేలతో 17 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయ్‌లెట్లు, రూ.3 లక్షల 40 వేలతో 20 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 16 కేంద్రాల్లో రూ.లక్ష 60 వేలతో ఆకు కూరల మొక్కలు పెంచి కేంద్రాలకు సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు. గ్రామాల్లో చేపడుతున్న 19 సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లలో ప్రస్తుతం 7 ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియా

## ఘనంగా ఆజాద్ జయంతి

**తాడేపల్లిరూరల్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం దుగ్గిరాలలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ తొలి విద్యా శాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి గొప్పబాటలు వేసిన మహోన్నత వ్యక్తి అని, మైనార్టీల సంక్షేమానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, హిందూ ముస్లింలు అన్నదమ్ముల్లా కలసిమెలసి తెల్లదొరలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో 10 సంవత్సరాలు జైలు జీవితం గడిపిన ధీరుడని, దేశానికి ఆయన సేవలు ఎనలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రషీద్, షేక్ జాన్ సైదా, షేక్ జిలానీ, షేక్ అబ్దుల్, పఠాన్ ఖాదర్, డాక్టర్ పెద్దేటి యోహాను, బులుసుపాటి ఎల్లేశ్వరరావు, మునిపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మైనార్టీ నాయకులు



## వ్యాధులపై అప్రమత్తత అవసరం

**ప్రత్తిపాడు:** గ్రామాల్లో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా కార్యాలయం సబ్ యూనిట్ ఆఫీసర్ కె.ప్రశాంత్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో కలసి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. తాగు నీటి గాబులు, ఖాళీ ప్రదేశాల్లో ఉన్న నీటిలో దోమల లార్వా ఉందా? లేదా? అన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాల బాధితులను గుర్తించి రక్తపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. దోమ లార్వా పెరగకుండా స్థానిక పంచాయతీ అధికారులతో కలిసి చర్యలు తీసుకోవాలని సూచించారు.



## ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన సీఎం

**తాడికొండ :** అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన అసెంబ్లీకి వెళ్లారు.

